RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:129 | మే 14, 2026 | వెల: రూ.3-00

## 45 ఏళ్ల తర్వాత ఇంటర్ పరీక్ష!



- ఎగ్జామ్ రాసిన మాజీ మావోయిస్టు నేత
- కోరుట్లలో తెలుగు పరీక్షకు హాజరు
- న్యాయవాది కావాలన్నదే దేవ్‌జీ లక్ష్యం

2లో







# మునిగాకే.. మేమొస్తాం..!

2లో

## ఓరుగల్లుకు వరద గండం..

### ముందస్తు చర్యలు శూన్యం

- జోరుగా నాలాల కబ్జా.. వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- వానాకాలం ముంచుకొస్తున్నా వదలని నిర్లక్ష్యం
- మహా నగరం నీట మునిగాకే హడావుడి
- రొటీన్‌గా మారిన హంగామా.. శాశ్వత పరిష్కారం శూన్యం
- ప్రతి ఏటా ఇదే తంతూ.. నగర ప్రజలకు తప్పని తిప్పలు
- పాలక వర్గం లేదు.. రెగ్యులర్ కమిషనర్ ను నియమించరు
- వందల కోట్ల స్మార్ట్ సిటీ నిధులు వృథా
- అమలుకు నోచుకోని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

వరంగల్ మహానగరాన్ని వరద ముప్పు వెంటాడుతోంది. ప్రతి ఏటా వర్షాలు రావడం, నగరం నీట మునగడం, ఆ తర్వాత పాలకులు పడవల్లో పర్యటిస్తూ హామీలు గుప్పించడం ఒక రొటీన్ ప్రక్రియగా మారిపోయింది. గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడైనా ముందస్తు చర్యలు చేపడతారని ఆశించిన నగరవాసులకు అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారుతోంది. నాలాల కబ్జాలు, మాయమవుతున్న చెరువులు, విచ్చలవిడి అక్రమ కట్టడాలతో నగరం కాంక్రీట్ జంగిల్‌లా మారి నీరు వెళ్లే దారి లేక విలవిలలాడుతోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి శాశ్వత నివారణ చర్యలకు ఆదేశించినా, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. కనీసం రెగ్యులర్ కమిషనర్ కూడా లేని దుస్థితిలో వరంగల్ నగరం నేడు దిక్కులేనిదిగా మారింది. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో, ఇప్పటికైనా యంత్రాంగం మేల్కోకపోతే ఓరుగల్లు ప్రజలకు మళ్లీ కన్నీటి కష్టాలు తప్పవని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణకు పొదుపు సూత్రాలు.. ఆంధ్రప్రదేశ్‌కు నిధుల హామీ



- పాలమూరుకు జాతీయ హోదా ఏమైంది?
- నీటి హక్కులు సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది
- బండి సంజయ్ కుమారుడిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్**

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు పొదుపు సూత్రాలు చెబుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం భారీగా నిధులు ఇస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు కేంద్రాన్ని కలుస్తున్నారని, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. మీ గురువును చూసైనా

మిగతా 2వ పేజీలో..

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి




- మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలు, ఈవీ ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి
- ఉబర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం

**వేద న్యూస్, హైదరాబాద్**

ప్రధాన నగరాల్లో రోజురోజుకూ తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబర్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఉబర్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఉబర్ సంస్థ కార్యకలాపాలు, హైదరాబాద్‌లో విస్తరణ

మిగతా 2వ పేజీలో..

## విచారణకు హాజరుకాని భగీరథ్

- రెండు రోజుల గడువు కోరుతూ లేఖ
- హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్



2లో

## బాలుడి హత్య కేసులో ఉరిశిక్ష

- ప్రధాన నిందితురాలికి కోర్టు సంచలన తీర్పు
- ఆటో డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు
- సనత్‌నగర్ ఘటనలో న్యాయం జరిగిందన్న కుటుంబం



వేద న్యూస్

గురువారం | మే 14, 2026

## 45 ఏళ్ల తర్వాత ఇంటర్ పరీక్ష!

### ఎగ్జామ్ రాసిన మాజీ మావోయిస్టు నేత

**వేద న్యూస్, జగిత్యాల**



మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ 45 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యారు. ఆయన పరీక్ష రాయడం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. దేవ్‌జీ 1980–82 కాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తూ రెండో సంవత్సరం తెలుగు పరీక్షను బహిష్కరించారు. దీంతో ఆ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. అనంతరం ఆయన మావోయిస్టు ఉద్యమంలో చేరి అడవిబాట పట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ, విద్యను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్ష రాసే అవకాశం లభించింది. గత కొద్ది రోజులుగా పరీక్ష కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారని తెలిసింది. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి చేరుకున్న దేవ్‌జీ తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష అనంతరం మాట్లాడుతూ విద్య జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. చదువు పూర్తి చేసి సమాజానికి ఉపయోగపడే దిశగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో న్యాయవాద కోర్సు చదివి పేద ప్రజల కోసం పనిచేయాలన్నదే తన లక్ష్యమని దేవ్‌జీ వెల్లడించారు. చట్టపరమైన అవగాహన ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. జీవితంలో ఎప్పుడైనా మార్పు సాధ్యమేనని యువతకు సందేశం ఇచ్చారు. దేవ్‌జీ పరీక్ష రాయడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒకప్పుడు ఉద్యమ బాట పట్టిన వ్యక్తి మళ్లీ విద్యాభ్యాసం వైపు అడుగులు వేయడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఆయన నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

### తెలంగాణకు పొదుపు సూత్రాలు

## ఆంధ్రప్రదేశ్‌కు నిధుల హామీ

**మొదటి పేజీ తరువాయి**

నేర్చుకోండి. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ప్రధానికి లేఖ రాయండి" అంటూ రేవంత్ రెడ్డికి సూచించారు. రాష్ట్రానికి నీటి హక్కులు సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడింది నీళ్ల కోసమేనని గుర్తుచేసిన కవిత, గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని అన్నారు. గోదావరిలో 964 టీఎంసీలు వినియోగించే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 220 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. కృష్ణా జలాల్లో కూడా రాష్ట్రం తన వాటాను పూర్తిగా వినియోగించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సాగుయోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కూడా కవిత ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు దేశం విడిచి వెళ్లకుండా వెంటనే లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు తీవ్రమైనవని, పారదర్శక విచారణ జరగాలంటే ఈ చర్యలు అవసరమని పేర్కొన్నారు. బాధితురాలి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బయటకు రావడం దురదృష్టకరమని, వాటిని ప్రచారం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికలకు సంబంధించిన అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. సమాజం ఆడపిల్లలను సులభంగా క్షమించదని, అందువల్ల బాధితురాలి గోప్యత కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొన్ని పార్టీలు కేవలం సామాజిక మాధ్యమాల్లో ట్వీట్లు పెట్టి సమస్య పరిష్కరించినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాము ఎల్లప్పుడూ ఆడపిల్లల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లు, జనగణన అంశాలపై కూడా కవిత స్పందించారు. మహిళా బిల్లులో ఓబీసీ ఉపకోటా తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులం, ఉపకులం, సామాజిక స్థితిగతులను నమోదు చేయాలని కోరారు. బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కోర్టుకు కూడా వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో రాజకీయ శూన్యతను ప్రశ్నించేందుకు తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీ నిర్మాణానికి ఇది పునాదిగా నిలుస్తుందని, ఈ కార్యక్రమాల ద్వారా నాయకత్వ బాధ్యతలు కూడా అప్పగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

**మొదటి పేజీ తరువాయి**

ప్రణాళికలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోనే ఉందని దారా ఖోస్రోషాహి తెలిపారు. ప్రస్తుతం అక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ కార్యాలయం నిర్మించేందుకు ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఈ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోందని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రస్తావించారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే ఆధునిక పార్కింగ్ విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాల వద్ద సరైన పార్కింగ్ సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలతో పాటు ఈవీ ఛార్జింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని ఉబర్ ప్రతినిధులకు సూచించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది. నగర రవాణా వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఆధునిక అర్బన్ మొబిలిటీ కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు వివరాలను ఉబర్ ప్రతినిధులకు వివరించారు. సుమారు 30 వేల ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ నగరం ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఈ ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే అనేక సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత డిసెంబరులో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా సంస్థలు పాల్గొని పెట్టుబడులపై ఆసక్తి చూపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం నిర్మాణానికి దారా ఖోస్రోషాహి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా–సౌత్ ఆసియా అధ్యక్షుడు ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునిగాకే మేమొస్తాం..!

- ఓరుగల్లుకు వరద గండం.. ముందస్తు చర్యలు శూన్యం
- జోరుగా నాలాల కబ్జా.. వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- వానాకాలం ముంచుకొస్తున్నా వదలని నిర్లక్ష్యం
- మహా నగరం నీట మునిగాకే హడావుడి
- రొటీన్‌గా మారిన హంగామా.. శాశ్వత పరిష్కారం శూన్యం
- ప్రతి ఏటా ఇదే తంతూ.. నగర ప్రజలకు తప్పని తిప్పలు
- పాలక వర్గం లేదు.. రెగ్యులర్ కమిషనర్ ను నియమించరు
- వందల కోట్ల స్మార్ట్ సిటీ నిధులు వృథా
- అమలుకు నోచుకోని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**



వరంగల్ నగరంలో ప్రతి ఏటా వర్షాలు రావడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావటం, ఆ వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడి చేయడం ఒక రొటీన్ ప్రక్రియగా మారిపోయింది. వరదలు వచ్చినప్పుడు పడవల్లో పర్యటిస్తూ, బాధితులకు హామీలు గుప్పించే పాలకులు, వానాకాలం వెళ్లిపోగానే ఆ ఊసే ఎత్తకపోవడం విచారకరం. గతాన్ని దృష్టిలో పెట్టుకొని కనీసం ఈ ఏడైనా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

### అస్తవ్యస్తమైన నాలాల వ్యవస్థ..

నగర వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉండటమే కాకుండా, నాలాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గత ప్రభుత్వాల నుంచి నేటి వరకు వరద ముంపు నివారణకు సరైన చర్యలు లేకపోవడం వల్లే వరంగల్ తరచూ నీట మునుగుతోంది. నగరంలో దాదాపు 20 నాలాలు ఉన్నప్పటికీ, అవి ఎక్కడికక్కడ కబ్జాలకు గురై తమ సహజ వెడల్పును కోల్పోయాయి. 20 మీటర్లు ఉండాల్సిన నాలాలు 10 మీటర్లకు కుదించుకుపోవడంతో వరద నీరు వెళ్లే మార్గం లేక కాలనీలను ముంచెత్తుతోంది.



### మాయమైన చెరువులు..

వరంగల్ నగరవ్యాప్తంగా చెరువులు, కుంటల భూములు విచ్చలవిడిగా కబ్జాలకు గురయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కాకతీయుల కాలం నాటి చెరువులు అడ్రస్ లేకుండా మాయమైపోవడం గమనార్హం. నగరం కాంక్రీట్ జంగిల్‌లా మారిపోవడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకపోయింది. చెరువుల పునరుద్ధరణ, కబ్జాల తొలగింపుపై పాలకులు శ్రద్ధ చూపకపోవడం వల్ల సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు.

### అక్రమ కట్టడాల జోరు

వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో నగరంలో ముందస్తు ప్రణాళికలు ఎక్కడా కనిపించడం లేదు. నగరవ్యాప్తంగా విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు వరద ముప్పును మరింత పెంచుతున్నాయి. నాలాలు, చెరువు శిఖం భూముల్లో నిర్మిస్తున్న కట్టడాలపై నిఘా ఉంచాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సరైన డ్రైనేజీ ప్రణాళిక లేకుండా వెలుస్తున్న కొత్త కాలనీలు భవిష్యత్తులో జలసమాధి అయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### నిధుల వ్యయంపై విమర్శలు

స్మార్ట్ సిటీ, అమృత్ వంటి పథకాల కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, వరద ముంపు నివారణలో పురోగతి శూన్యం. మౌలిక వసతుల కోసం కోట్లాది రూపాయలు కేటాయించినా, వరద సమయంలో అవి పని చేయకపోవడం అధికారుల వైఫల్యమే. హంటర్ రోడ్ బొందివాగు నాలా విస్తరణ, పోతనగర్ నాలా పనులు వంటి కీలక ప్రాజెక్టులు నేటికీ మధ్యలోనే నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### నగరానికి దిక్కు ఎవరు?

వరంగల్ నగరానికి అసలు దిక్కు ఎవరూ అన్న ప్రశ్న ఇప్పుడు నగరవాసులను వేధిస్తోంది. నగరానికి ప్రస్తుతం పాలక వర్గం లేదు, అలాగే రెగ్యులర్ కమిషనర్ కూడా అందుబాటులో లేరు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో ఈ కీలక సమయంలో బాధ్యతాయుతమైన అధికారులు లేకపోవడంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పర్యవేక్షణ కరువై ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు పెరుగుతుంటే, ప్రజల సమస్యలను విన్నవించుకోవడానికి సరైన వేదిక లేకుండా పోయింది.

### సీఎం ఆదేశించినా పట్టించుకోవట్లే..

గతేడాది వరదల సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి, శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చినా, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. హనుమకొండ సమ్మయ్యనగర్ వద్ద గేట్లు అమర్చడం, ఇతర నాలాల విస్తరణ పనులు ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకుల మాటలకు, అధికారుల చేతలకు పొంతన లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### తీరేనా ఓరుగల్లు కష్టాలు?

వచ్చే వర్షాకాలంలోనైనా ఓరుగల్లు ప్రజల బాధలు తీరుతాయా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. వర్షాలు రావడం, నగరం నీట మునగటం రొటీన్‌గా మారిన నేపథ్యంలో, ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ముందస్తు జాగ్రత్తలు లేక వేలాది కుటుంబాలు నిరాశ్రయులవుతుంటే, పాలకులు కేవలం హడావిడికే పరిమితమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టకపోతే ఓరుగల్లు చరిత్రలో మరో విషాదం తప్పదు.

### జిల్లా స్థాయి ఆఫీసులకు

## కనీస భద్రత కరువు

- వాచ్మెన్ లేకుండానే కొనసాగుతున్న కీలక అధికారుల కార్యకలాపాలు
- రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో ఆందోళన
- విలువైన రికార్డులు, ఇండస్ట్రియల్ డాక్యుమెంట్ల భద్రతపై ప్రశ్నలు
- 40కి పైగా కంప్యూటర్లు ఉన్నా సీసీ కెమెరాలు మాత్రం లేవు
- వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని ఉద్యోగుల విజ్ఞప్తి



**వేద న్యూస్, వరంగల్**

వరంగల్–ములుగు ప్రధాన రహదారిలోని పెద్దమ్మగడ్డ జంక్షన్ వద్ద ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో కనీస వసతులు లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా స్థాయి ప్రధాన కార్యాలయంగా కొనసాగుతున్న ఈ కార్యాలయంలో డివిజనల్ ఇంజనీర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సబ్ ఇంజనీర్‌లతో పాటు దాదాపు 7 నుంచి 8 మంది కీలక అధికారులు ప్రతిరోజూ విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ కార్యాలయానికి కనీసం ఒక వాచ్మెన్ కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కార్యాలయంలోనే విద్యుత్ శాఖకు సంబంధించిన కీలక రికార్డులు, విలువైన డాక్యుమెంట్లు, ఇండస్ట్రియల్ కంపెనీలకు సంబంధించిన ఫైల్స్ భద్రపరిచి ఉంటాయి. దాదాపు 40 వరకు కంప్యూటర్లు, వాటికి సంబంధించిన విలువైన పరికరాలు కూడా ఇక్కడే ఉన్నాయి. ఉద్యోగులు కీలక సమాచారాన్ని కంప్యూటర్లలోనే భద్రపరుస్తున్నారు. అయితే భద్రతా చర్యలు మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో పశువులు, పందులు, కుక్కలు, పాములు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. అంతేకాకుండా కనీసం సీసీ కెమెరాలు కూడా అమర్చకపోవడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతిరోజూ రాత్రివేళల్లో ఒక సబ్ ఇంజనీర్ విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఆయన భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సమాచారం. ఒకవేళ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లా ఎన్పీడీసీఎల్ సీఎండీ, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కార్యాలయానికి భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు అమర్చాలని, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

## బాలుడి హత్య కేసులో ఉరిశిక్ష

- ప్రధాన నిందితురాలికి కోర్టు తీర్పు
- ఆటో డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు
- సనత్‌నగర్ ఘటనలో న్యాయం జరిగిందన్న కుటుంబం

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో సంచలనం సృష్టించిన ఎనిమిదేళ్ల బాలుడు అబ్దుల్ వహీద్ హత్య కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. చిట్టీ డబ్బుల వివాదంలో బాలుడిని కిరాతకంగా హత్య చేసిన ప్రధాన నిందితురాలు ఇమ్రాన్ ఖాన్కు ఉరిశిక్ష విధిస్తూ మేడ్చల్–మల్కాజ్‌గిరి మూడో అదనపు కోర్టు తీర్పు చెప్పింది. ఈ నేరంలో సహకరించిన ఆటో డ్రైవర్ మహ్మద్ రఫీక్కు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం 2023 ఏప్రిల్ 20న ఈ దారుణ ఘటన జరిగింది. బాలుడి తండ్రి వసీం ఖాన్కు, చిట్టీల వ్యాపారం చేసే ఇమ్రాన్‌కు మధ్య సుమారు రూ.7 లక్షల ఆర్థిక లావాదేవీల వివాదం నెలకొంది. ఈ కక్షతోనే వసీం ఖాన్ కుమారుడు అబ్దుల్ వహీద్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న బాలుడితో తనకు ఆరోగ్యం బాగోలేదని చెప్పి ఓఆర్ఎస్ ప్యాకెట్ తెప్పించుకున్న ఇమ్రాన్, బాలుడు తిరిగి రాగానే గొంతు నులిమి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం కాళ్లు, చేతుల ఎముకలు విరిచి మృతదేహాన్ని బకెట్‌లో కుక్కినట్లు పోలీసులు వెల్లడించారు. తర్వాత మృతదేహాన్ని పాలిథిన్ సంచిలో చుట్టి ఆటో డ్రైవర్ రఫీక్ సహాయంతో ఫతేనగర్ సమీపంలోని నాలాలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన సనత్‌నగర్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ దారుణ హత్య బయటపడింది. పోలీసులు సమర్పించిన పక్కా ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి మండవ వెంకటేశ్వర రావు కీలక తీర్పు వెలువరించారు. ఇమ్రాన్‌కు ఉరిశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, రఫీక్‌కు ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. కోర్టు తీర్పుపై బాలుడి తండ్రి వసీం ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం జరిగిందని అన్నారు. ఈ కేసు అప్పట్లో నగరవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపగా, ఇప్పుడు వెలువడిన తీర్పు మరోసారి చర్చనీయాంశమైంది.

## విచారణకు హాజరుకాని బండి భగీరథ్

**వేద న్యూస్, హైదరాబాద్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి రావడానికి రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపించారు. మే 8న మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ తన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని భగీరథ్ స్పష్టం చేసినట్లు సమాచారం. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని పోలీసులను కోరారు. ప్రస్తుతం ఈ వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ కేసులో పోలీసులు కఠినమైన పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎల్), 6లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. బాధితురాలి వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ



పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. మరోవైపు తమపై తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

వేద న్యూస్

గురువారం మే 14, 2026

# ప్రమాదాలకు అడ్డాగా రైచూర్ రహదారి..!



- డివైడర్ నిర్మాణం పూర్తి.. లైటింగ్ మాత్రం గల్లంతు
- రాఘవేంద్ర కాలనీల చీకట్లు..!

**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి :**

గద్వాల్ పట్టణంలోని ధరూర్ మెట్టు రైచూర్ ప్రధాన రహదారిపై ఉన్న రాఘవేంద్ర కాలనీ వద్ద ఇటీవల నిర్మించిన డివైడర్ ప్రజలకు ఉపయోగపడాల్సిందిపోయి, ప్రస్తుతం ఇబ్బందులకు కారణమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివైడర్ నిర్మాణం చేపట్టిన అధికారులు అక్కడ హైమాస్ట్ లైట్లు, వీధి దీపాల ఏర్పాటు పూర్తిగా విస్మరించారని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో రహదారి మొత్తం అంధకారంగా మారుతుండటంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు బయటకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అదే సమయంలో రోడ్డు పక్కనే ఉన్న వైన్ షాప్ కారణంగా రాత్రివేళ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. సరైన లైటింగ్ లేకపోవడంతో వాహనాలు ఏ వైపు నుంచి వస్తున్నాయో కనిపించక ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. రైచూర్ నుంచి గద్వాలకు వచ్చే ప్రధాన ప్రవేశ మార్గం ఇదే కావడంతో పట్టణ ముఖద్వారంలా కనిపించే ఈ ప్రాంతంలో కనీస లైటింగ్ సౌకర్యాలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది.

# నూతన వంటశాల నిర్మాణానికి భూమిపూజ



**వేద న్యూస్, గొడిసెలపేట :**

గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న వంటశాల భవన నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ కంధికట్ల అమృత రాజేష్ ఆధ్వర్యంలో ఈ భూమిపూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి, పిల్లర్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా వంట గది నిర్మాణం ఎంతో అవసరమని, నాణ్యతా ప్రమాణాలతో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

నెలకొండపల్లి మండలం మంద్రాజుపల్లి గ్రామానికి చెందిన తాటికొండ కన్నయ్య, ఉష దంపతుల కుమారుడు శేషసాయి వివాహం సింజిత్‌తో శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలకొండపల్లి మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగబండి శ్రీనివాసరావు, మాజీ సిడిసి చైర్మన్ నెల్లూరు లీలా ప్రసాద్, మండల సెక్రటరీ ఎన్నెంబోయిన శ్రీను, కోనాయిగూడెం సర్పంచ్ కోటి సైదిరెడ్డి, మండల నాయకులు ఎస్.కె. హుస్సేన్, జిల్లా ఉద్యమకారుడు మరికంటి రేణుబాబు, మాజీ ఎంపీటీసీ నరసింహారావు, సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, పెబల్లి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాములపల్లిలో వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం



**వేద న్యూస్, గొల్లపల్లి:**

మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో బుధవారం నూతన గృహ ప్రవేశ కార్యక్రమం పండుగలా జరిగింది. ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారురాలు పొనగంటి సుగుణ రాజనర్సయ్య దంపతుల నూతన గృహ ప్రవేశోత్సవంలో ఇందిరమ్మ కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని, పేదల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆమనగల్లులో ఆధ్యాత్మిక సేవ..

- ఆలయ అభివృద్ధికి సర్పంచ్ దంపతుల విరాళం




**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న తిరుపతమ్మ, గోపయ్య, అంకమ్మతల్లి, నాగులమ్మతల్లి ఆలయాలు గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తున్నాయి. గ్రామ ప్రజల ఆకాంక్షల మేరకు భక్తిశ్రద్ధలతో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయానికి లక్ష్మీదేవిగూడెం సర్పంచ్ ఎలికట్టె భరత్‌శ్రావణి దంపతులు రూ.1,00,116 ఆర్థిక సహాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. దేవాలయ నిర్మాణాభివృద్ధికి ఆయన అందించిన ఈ విరాళం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ మాట్లాడుతూ, భక్తి భావంతో చేసిన ఈ సహాయం దేవాలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే భరత్ దంపతులు దేవాలయ నిర్మాణానికి కూడా భారీ విరాళం అందించడం ప్రశంసనీయమని గ్రామస్థులు కొనియాడారు. అనంతరం దేవాలయ కమిటీ నిర్వాహకులు భరత్‌శ్రావణి దంపతులను ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# కాజీపేట సీఐగా శ్యామ్ సుందర్ బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, కాజీపేట:**




కాజీపేట పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా జె. శ్యామ్ సుందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయనను కాజీపేట ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈ సందర్భంగా కాజీపేట పోలీస్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాజీపేట పట్టణ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన సూచించారు.

# ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభం

- దళిత నాయకులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌కు సంబంధించి ఖమ్మం జిల్లా చైర్మన్ కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్జర్వర్‌గా వెంకట నరసయ్యను నియమించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకట నరసయ్య, దళిత నాయకులకు దరఖాస్తుల పిలుపునిచ్చారు. ఖమ్మం డీసీసీ ఆదేశాల మేరకు నూతన ఎస్సీ సెల్ చైర్మన్ పదవికి దరఖాస్తులను 16వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, అబ్జర్వర్ వెంకట నరసయ్య సమక్షంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి దళిత నాయకులు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కిలారి అనిల్, కొట్టే రాజశేఖర్, నాయకులు గజ్జి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా..

**వేద న్యూస్, చొప్పదండి:**

మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో ఈ నెల 31వ తేదీలోపు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మమత సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎరువుల కొనుగోలు, పంట రుణాలు, ధాన్యం విక్రయాల్లో అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేద న్యూస్

గురువారం మే 14, 2026

## జనగణన సర్వేకు ప్రజలు సహకరించాలి




**- తహశీల్దార్ అంబటి రజిత**

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలంలోని మధుర నగర్, కూరిక్యాల గ్రామాల్లో కొనసాగుతున్న జనగణన-2026 సర్వేను తహశీల్దార్ అంబటి రజిత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వద్ద ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇంటి యజమాని పేరు, కుటుంబ సభ్యుల సంఖ్య, గదుల వివరాలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్డి, వాహనాలు, టీవీ, ఇంటర్నెట్ వంటి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు. ంఅదేవిధంగా ఆధార్, బ్యాంకు ఖాతా, పాన్ వంటి వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, రహస్య సంఖ్యలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ చెన్నయ్య, ఆర్ఐ సంతోష్ కుమార్, జీపీఓ నవీన్‌తో పాటు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## మూగజీవాలకు నీటి సదుపాయం

- ఎండల తీవ్రతతో ఎండిపోయిన కుంటలు..
- దాహంతో అలమటించిన పశువులు, గొర్రెలు
- సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ప్రత్యేక చర్యలు



**వేద న్యూస్, కారేపల్లి:**

ఎండలు మండిపోతున్నాయి.. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో కుంటలన్నీ బీటలు వారుతున్నాయి. మనుషులకే కాదు, మూగజీవులకూ గుక్కెడు నీరు దొరకని దుస్థితి నెలకొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అపర భగీరథుడిలా మారి మూగజీవాల ప్రాణాలను నిలబెట్టారు. గాదెపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని నీటి కుంటలు పూర్తిగా ఎండిపోవడంతో మేతకు వెళ్లే పశువులు, గొర్రెలు నీరు లేక అల్లాడిపోతున్నాయని గ్రామస్తులు, పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాల దాహాన్ని గుర్తించిన సర్పంచ్ రంజిత్ కుమార్ వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారానికి నడుం బిగించారు. నిధుల మంజూరు కోసం వేచి చూడకుండా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అండతో గ్రామంలో నూతన బోరు బావిని తవ్వించారు. అనంతరం విద్యుత్ మోటార్ బిగించి గొర్రెలు, పశువులు తాగేందుకు అనువుగా నీటి సౌకర్యాన్ని కల్పించారు. బుధవారం మధ్యాహ్నం మండుటెండలో నాలికలు పిడచకట్టుకుపోయిన వందలాది గొర్రెల మందలు నీటి వద్దకు పరుగున రావడం స్థానికులను కదిలించింది. కొత్తగా ఏర్పాటు చేసిన బోరు నుంచి వస్తున్న చల్లని నీటిని తాగుతూ మూగజీవాలు ఉపశమనం పొందడం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. నోరు లేని మూగజీవాల దాహం తీర్చడం కంటే గొప్ప తృప్తి మరొకటి లేదు. ఈ వేసవిలో ఏ ఒక్క పశువు కూడా నీరు లేక ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో ఈ బోరును ఏర్పాటు చేశాం అని సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ తెలిపారు.

## జూన్2న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు



**- లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ కీలక సూచనలు**

**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ అధికారులు కీలక సూచనలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇండ్ల స్లాబ్ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు వెంటనే ప్లాస్టరింగ్, తలుపులు, కిటికీలు తదితర ఫినిషింగ్ పనులను ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ పనులు పూర్తిచేసిన లబ్ధిదారులకు ఫైనల్ బిల్లులు కూడా త్వరితగతిన చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఎటువంటి ఆలస్యం చేయకుండా మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, బిల్లులు పొందేందుకు అవసరమైన ప్రక్రియలను ముగించుకొని గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని హౌసింగ్ ఏఈ స్వప్న, అదనపు ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ కోరారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రవీంద్రప్రసాద్‌కు ఘన సన్మానం



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఇంచార్జ్ ఎంపీడీఓ) అదనపు బాధ్యతలు స్వీకరించిన మల్లెల రవీంద్రప్రసాద్‌కు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ మండల అభివృద్ధి, గ్రామాల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామీణాభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. దీనికి స్పందించిన మల్లెల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, భాగ్యనగర్ తండా, ఉసిరికాయలపల్లి గ్రామాల సర్పంచ్‌లు గుగులోత్ వరలక్ష్మి రాజు, మేదరి టోనీ, బానోత్ హీరాలాల్, పంచాయితీ కార్యదర్శులు అనిల్ కుమార్, నిరంజన్, నాయకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ కేంద్ర వైఫల్యమే

**- బీఆర్ఎస్వీ నాయకుడు కొమ్ముల శివ విమర్శ**



**వేద న్యూస్, శాయంపేట:**

దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై బీఆర్ఎస్వీ నాయకుడు కొమ్ముల శివ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు శాయంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన జాతీయ అర్హత పరీక్షను కూడా పకడ్బందీగా నిర్వహించలేకపోవడం కేంద్ర వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. గతంలో జరిగిన ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడంతోనే మళ్లీ లీకేజీ జరిగిందని విమర్శించారు. ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మళ్లీ పారదర్శకంగా నీట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరికిల్ల ప్రసాద్, రంగు మహేందర్, కుతాటి రమేష్, అరికెళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కొంతంగి అగ్నిబాధితులకు అండగా ముద్రగడ గిరిబాబు

**- బియ్యం,నిత్యావసర సరుకులు,దుస్తులు పంపిణీ**

**వేద న్యూస్, ప్రత్తిపాడు :**



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం కొంతంగి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా

బియ్యం,నిత్యావసర సరుకులు, వంట పాత్రలు,దుప్పట్లు మరియు కుటుంబ సభ్యులకు నూతన దుస్తులను అందజేశారు. బాధితులతో మాట్లాడిన గిరిబాబు,ధైర్యంగా ఉండాలని సూచిస్తూ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడటం బాధాకరం. ఇలాంటి కష్టకాలంలో బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్,శంఖవరం మండల వైసీపీ అధ్యక్షులు నరాల శ్రీనివాస్,ప్రత్తిపాడు నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు దూడల శివకుమార్,గింజాల కొండబాబు,రత్నాకర్,యువజన విభాగ అధ్యక్షులు సకురు గుర్రాజు,చల్లా గంగా సత్య ప్రసాద్,చొప్పా రాంబాబు తదితర నాయకులు,కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

**వేద న్యూస్, గంగాధర:**



**- 30 తులాల వెండి, బంగారం, నగదు అపహరణ**

గంగాధర మండలంలోని పెండలోనిపల్లి ముప్పిడి నర్సింహులపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంటిలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల హేమలత ఈ నెల 11వ తేదీన ఉదయం తన చిన్నాన్న నందయ్య ఇంటిలోని చెట్లకు నీరు పోసి ఇంటికి తాళం వేసి వెళ్లింది. బుధవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టినట్లు గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలను ధ్వంసం చేసి అందులో భద్రపరిచిన సుమారు 30 తులాల వెండి కడియాలు, 5 గ్రాముల బంగారం, రూ.7 వేల నగదును అపహరించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలు సేకరించి ఆధారాలు నమోదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

## ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ అంబటి రజిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల తీరును పరిశీలించిన ఆమె, రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వడ్ల నాణ్యత, నిల్వ విధానం, రికార్డుల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా వెంటనే లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు తాగునీరు, నీడ, తూకం ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం తూకంలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీలో గిర్దావర్ సంతోష్ కుమార్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి

- సింగరేణి సహకారంతో మందమర్రిలో జర్మనీ జాబ్ ట్రైనింగ్ క్యాంప్
- జూన్ 10 నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**వేద న్యూస్, మందమర్రి:**

నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ, వృత్తిపరమైన శిక్షణ ద్వారా స్థానిక యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సింగరేణి సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన జర్మనీ జాబ్ ట్రైనింగ్ క్యాంప్ లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం ఎంపికైన అభ్యర్థులకు జూన్ 10 నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. విదేశీ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి టామ్‌కామ్ వద్ద తగిన మౌలిక వసతులు, నిపుణులైన శిక్షకులు, అవసరమైన బడ్జెట్ అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చొరవను ఆయన అభినందించారు. అలాగే కార్యక్రమానికి సహకరించిన సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, ఎంఆర్‌ఓ సతీష్ కుమార్, డీజీఎం పర్సనల్ అశోక్, జీఎంవీటీసీ మేనేజర్ శ్రీధర్, టామ్‌కామ్ మేనేజర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన తిరుపతమ్మ గోపయ్య, అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణ కర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. గ్రామ వేద పండితులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, తిరుపతమ్మ గోపయ్య, అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి విగ్రహాలను అత్యంత వైభవంగా ప్రతిష్టించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతమ్మ గోపయ్య అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్, ఉప సర్పంచ్ శాలెంరాజు, గంట స్వాతి నరసయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రహదారి పనులకు శంకుస్థాపన



**వేద న్యూస్, కారేపల్లి:**

ఉసిరికాయలపల్లి గ్రామ పరిధిలోని నడుమూరు నుంచి తుమ్మలచెరువు వరకు వెళ్లే వ్యవసాయ పొలాల రహదారి అభివృద్ధి పనులకు పట్టాభి రామారావు శంకుస్థాపన చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి రాజు, ఉపసర్పంచ్ విజయలక్ష్మి సత్యం, కోఆప్షన్ సభ్యుడు మోరపాక శ్రీనివాసరావు, మొదటి వార్డు సభ్యురాలు అనిత, గ్రామ పెద్దలు జగ్గయ్య, నాగేశ్వరావు, తాండ్ర కార్తీక్, కాటయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న కూలీలకు కోఆప్షన్ సభ్యుడు మోరపాక శ్రీనివాసరావు మజ్జిగ పంపిణీ చేశారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## బస్తాకు రూపాయి ఇస్తేనే లారీలు వస్తున్నాయి



- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అష్టకష్టాలు
- మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ విమర్శ

**వేద న్యూస్, రామడుగు:**

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని వెదిర గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 160 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఏ ఒక్కచోటా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు జరగడం లేదన్నారు. వేలాది బస్తాలు మిల్లులకు తరలించకుండా కేంద్రాల వద్దనే పేరుకుపోయాయని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో ఐదు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం తరుగు పేరిట మూడు కిలోలు కోత విధిస్తున్నారని, 45 కిలోల బస్తాలకు కాంటా పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా బస్తాకు రూపాయి చెల్లిస్తేనే లారీలు వస్తున్నాయని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కర్షకుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసేలోపు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని రవి శంకర్ హెచ్చరించారు.

## సింగరేణి ఎంపీడీవోకు సన్మానం



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో అధికారిని మండల సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. సింగరేణి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఎంపీడీవోకు పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులుప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## ధాన్యం కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

రబీ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మిర్యాలగూడ పరిధిలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మొదటి ప్రాధాన్యతతో అన్‌లోడ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ప్రతి లారీని 12 గంటల్లోపు ఖాళీ చేసి తిరిగి పంపేలా ఆదేశాలు జారీ చేశారు. కొన్ని కేంద్రాల్లో తాలు పేరుతో అధిక తూకం వేయడం, కటింగ్‌లు పెట్టడం, బస్తాకు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎలాంటి అక్రమాలు, బెదిరింపులు ఎదురైనా వెంటనే పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## లిఫ్ట్ లో ఇరుక్కొని చిన్నారి మృతి

**వేద న్యూస్ హైదరాబాద్ :**

లిఫ్ట్ లో ఇరుక్కొని చిన్నారి మృతి చెందిన విషాదకర సంఘటన గచ్చిబౌలిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలిలోని గౌలిదొడ్డిలోని ఓ ప్రైవేట్ మహిళా హాస్టల్‌లో జార్ఖండ్‌కు చెందిన బిస్తు ఘోష్(5) అనే బాలిక లిఫ్ట్ గ్రిల్‌లో చిక్కుకొని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దేవాదాయ శాఖ అధికారులను బెదిరింపులకు గురి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

దేవాదాయ ధర్మాదాయ శాఖలోని ఉన్నతాధికారులను, సిబ్బందిని సోషల్ మీడియా వేదికగా దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగిస్తూ, ప్రాణహాని తలపెడుతున్న మండల భూపాల్ అనే వ్యక్తిపై మట్వాడ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల భూపాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా అధికారుల ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నట్లు తేలింది. నిందితుడు రాష్ట్రీయ హిందూ పరిషత్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అని చెప్పుకుంటూ, కార్యాలయానికి వచ్చి సమాచారం సేకరించి, ఆపై ఆలయ ధర్మకర్తలను, అర్చకులను మరియు ఉద్యోగులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, సోషల్ మీడియాలో ఆమెపై మరియు ఆమె కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడు.

**దేవాదాయ శాఖ ఉద్యోగి పై భౌతిక దాడి మరియు బెదిరింపులు**

దేవాదాయ శాఖ ఉద్యోగి నల్లబోయిన రాజేందర్ పై కూడా నిందితుడు అత్యంత క్రూరంగా ప్రవర్తించాడు. రాజేందర్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, గొంతు పట్టుకుని భౌతిక దాడికి పాల్పడటమే కాకుండా, తన మాట వినకపోతే చంపేస్తానని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. అలాగే, లొంగి ఉండకపోతే మత వ్యతిరేకిగా ముద్ర వేస్తామని, ఉద్యోగం తీయించేస్తామని నిందితుడు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు ఆధారాలు లభించాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు మట్వాడ పోలీసులు నిందితుడిపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. Cr.No. 235/2026: సెక్షన్లు 351(2), 115(2), 296(ఎ), 308(3), 356(2) మరియు 140(3) BNS. Cr.No. 236/2026: సెక్షన్లు 329(4), 351(2), 308(3), 221 మరియు 356(2) BNS. ఈ కేసులకు సంబంధించిన లోతైన విచారణ బాధ్యతను ఎస్ఐబి. శ్రీనివాస్ కి అప్పగించారు. చట్టాన్ని అతిక్రమించి, అధికారులను మరియు ప్రభుత్వ సిబ్బందిని బెదిరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మట్టేవాడ సీఐ కరుణాకర్ హెచ్చరించారు.

# ధాన్యం కేంద్రాలపై కలెక్టర్ ఫైర్

- నిర్లక్ష్యంపై అధికారులకు వార్నింగ్
- ట్యాబ్ ఎంట్రీలు తప్పనిసరి
- నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశం



**వేద న్యూస్ వికారాబాద్ :**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను హెచ్చరించారు. బుధవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, అక్కడి నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, ప్యాడీ లోడ్లు వెళ్లినా ఎంట్రీలు నమోదు చేయకపోవడం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల వివరాలు, వాహనాల సమాచారం, ధాన్యం రాకపోకల వివరాలు పూర్తిగా నమోదు చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని పేర్కొన్నారు. ప్యాడీ క్లీనర్ లేకుండా ధాన్యం మిల్లులకు పంపడంపై కూడా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుభ్రపరిచిన ధాన్యాన్నే మిల్లులకు పంపించాలని స్పష్టం చేశారు. లేదంటే రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని, మిల్లర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరుపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఓలు కేవలం తేమ శాతం పరిశీలించి వెళ్లిపోవడం సరైన విధానం కాదన్నారు. కేంద్రంలోకి వచ్చే, బయటకు వెళ్లే ధాన్యాన్ని పూర్తిగా పర్యవేక్షించడం, రిజిస్టర్లు తనిఖీ చేయడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్యాబ్ ఎంట్రీలు చేయకుండా ధాన్యం తరలించడం వల్ల రైతులకు చెల్లింపుల్లో సమస్యలు వస్తాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి లోడ్‌కు వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యవేక్షణలో లోపాలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలో మహిళా సంఘ సభ్యులతో మాట్లాడిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. కొందరు రైతులు అధిక ధరల కోసం ప్రైవేటుగా ఇతర ప్రాంతాలకు ధాన్యం తరలిస్తున్న విషయాన్ని కూడా సమీక్షించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సమర్థంగా పనిచేస్తే రైతులు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, డీఏవో వీరప్ప, తహసీల్దార్ నందిని, ఏఈఓ రోహిత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పశువుల పాక దగ్ధం.. రూ.3 లక్షల ఆస్తి నష్టం

**వేద న్యూస్ నిర్మల్ :**



నిర్మల్ జిల్లా కుభీర్ మండలం రంజని గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు పశువుల పాకకు మంటలు అంటుకుని భారీ ఆస్తి నష్టం జరిగింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా పశువుల పాక నుంచి మంటలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భైంసా అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు సమీపంలోని ఇండ్లకు వ్యాపించే ప్రమాదం ఉండగా, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. అయితే అప్పటికే పశువుల పాకలో ఉన్న సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. విలువైన వ్యవసాయ పనిముట్లు, కలప సామగ్రి, పైపులు, పశుగ్రాసం, స్ప్రే పంపులు సహా ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. జరిగిన నష్టంపై నివేదిక సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దానిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# పని హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వం

- కొత్త నిబంధనలతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు
- 15న పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నాకు పిలుపు



**వేద న్యూస్, కారేపల్లి:**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పని హక్కును హరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కేసగాని ఉపేందర్ ఆరోపించారు. బుధవారం కారేపల్లి మండలం గాంధీనగర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యకాస బృందం సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేకపోవడంతో పాటు ఫోటో విధానం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, కూలీలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యకాస నేత కేసగాని ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి నిధులు తగ్గించిందని విమర్శించారు. రోజువారీ కూలీ రూ.307 ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా రావడం లేదన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు అందించడం లేదని ఆరోపించారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రూ.600 వేతనం, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, ప్రమాద బీమా అమలు చేసి ప్రమాదంలో మరణించిన కూలీల కుటుంబాలకు రూ.10 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెల 15న జీపీ కార్యాలయాల ఎదుట, 20న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మౌనిక, నాగమణి, బాయమ్మ, సూరమ్మ, దశరథ, కోటయ్య, వెంకన్న, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కుల చైతన్యానికి బీఆర్ఎస్ పిలుపు

- హనుమకొండలో పోస్టర్ ఆవిష్కరణ
- కార్మిక సంఘాల నేతలతో సమావేశం
- హక్కుల పరిరక్షణపై చర్చలు



**వేద న్యూస్ హనుమకొండ :**

భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కార్మిక హక్కుల చైతన్య మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కార్మిక సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్మిక హక్కుల చైతన్య మాసోత్సవ సదస్సు అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యలపై చర్చించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. కార్మిక వర్గం సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడేందుకు చట్టబద్ధమైన చర్యలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. శ్రమకు తగిన గౌరవం, భద్రత, వేతనాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించడంలో సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచడం ద్వారా వారికి మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. మాసోత్సవాల ద్వారా కార్మికుల్లో చైతన్యం తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక సంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం కార్మికుల హక్కుల పరిరక్షణకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై చర్చలు నిర్వహించారు. కార్మిక వర్గం బలోపేతం అయితేనే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# లబ్ధిదారులకు రూ.39 లక్షల చెక్కులు



- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పంపిణీ
- సంక్షేమ పథకాల్లో పారదర్శకత : మహిపాల్ రెడ్డి
- జిన్నారంలో ప్రత్యేక సమావేశం

**వేద న్యూస్ సంగారెడ్డి :**

పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన రూ.39 లక్షల విలువైన చెక్కులను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. జిన్నారం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి పారదర్శకతతో అందిస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో సహాయం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాలకు ఊరట కలుగుతోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, తహసిల్దార్ దేవదాసు, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, సహాయ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంపై ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# మెరుగైన సర్పంచులకు కలెక్టర్ గుడ్‌న్యూస్

**వేద న్యూస్ యాదాద్రి భువనగిరి :**



గ్రామాభివృద్ధి, విద్యా రంగంలో మెరుగైన పనితీరు కనబరిచే సర్పంచులకు ఆగస్టు 15న ప్రత్యేక అవార్డులు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రకటించారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు సర్పంచులను ఎంపిక చేసి పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో సర్పంచులు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సంబంధిత ప్రజాప్రతినిధులకు తప్పకుండా సమాచారం ఉంటుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో బాలికల భవిష్యత్తు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

వేద న్యూస్

గురువారం మే 14, 2026

# టెస్టు క్రికెట్‌లో భారత హవా.. బుమ్రా నంబర్‌వన్, జడేజా అగ్ర ఆల్‌రౌండర్



**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు మరోసారి తన సత్తా చాటుకుంది. ముఖ్యంగా భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుని మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించాడు. మరోవైపు రవీంద్ర జడేజా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, భారత యువ బ్యాటర్లు కూడా టాప్-10లో చోటు సంపాదించడం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. భారత జట్టు ప్రధాన ఆయుధంగా మారిన జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం టెస్టు క్రికెట్‌లో అత్యంత ప్రమాదకర బౌలర్‌గా గుర్తింపు పొందుతున్నాడు. వేగం, లైన్ అండ్ లెంగ్త్, యార్కర్లు, స్వింగ్, బౌన్సర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడంలో అతడు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలుస్తున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 879 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్న బుమ్రా.. గత కొన్నేళ్లుగా భారత టెస్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. బుమ్రా తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ రెండో స్థానంలో నిలిచాడు. అతని వేగం, అనుభవం ఇంకా ఆస్ట్రేలియా జట్టుకు ప్రధాన బలంగా కొనసాగుతున్నాయి. ఇక న్యూజిలాండ్ బౌలర్ మాట్ హెన్రీ మూడో ర్యాంక్ సాధించడం విశేషం. ఇటీవల టెస్టుల్లో అతను కనబరిచిన అద్భుత ప్రదర్శన అతడిని టాప్-3లోకి తీసుకెళ్లింది. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ కూడా స్థిరమైన ప్రదర్శనతో 12వ స్థానంలో కొనసాగుతున్నాడు. ముఖ్యంగా విదేశీ పిచ్‌లపై అతని దూకుడు బౌలింగ్ జట్టుకు ఎంతో ఉపయోగపడుతోంది. మరోవైపు భారత స్పిన్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్న రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ర్యాంకుల్లో స్వల్పంగా వెనుకబడ్డారు. జడేజా 14వ స్థానంలో ఉండగా, కుల్దీప్ 15వ స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఇద్దరూ మ్యాచ్ విజేతలుగా నిలిచే సామర్థ్యం కలిగిన బౌలర్లేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాళ్ల ఆధిపత్యం కొనసాగుతోంది. అనుభవజ్ఞుడైన జో రూట్ మరోసారి ప్రపంచ నంబర్‌వన్ టెస్టు బ్యాటర్‌గా నిలిచాడు. అతని స్థిరత్వం, భారీ ఇన్నింగ్స్‌లు ఇప్పటికీ ఇంగ్లాండ్ జట్టుకు ప్రధాన బలం. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతుండగా, అతను భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌ను శాసించే ఆటగాడిగా ఎదుగుతున్నాడని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ మూడో ర్యాంక్ సాధించాడు. ముఖ్యంగా క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా పరుగులు చేయగల సామర్థ్యం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోంది. ఇటీవల కీలక మ్యాచ్‌ల్లో అతను ఆడిన ఇన్నింగ్స్‌లు ఆస్ట్రేలియా విజయాల్లో కీలకపాత్ర పోషించాయి. భారత బ్యాటర్లలో యువ సంచలనం యశస్వి జైస్వాల్ మరోసారి టాప్-10లో చోటు దక్కించుకోవడం విశేషం. ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్న జైస్వాల్.. తక్కువ కాలంలోనే ప్రపంచ స్థాయి బ్యాటర్‌గా ఎదుగుతున్నాడు. టెస్టు క్రికెట్‌లో అతని దూకుడు ఆట, భారీ షాట్లు, ఓర్పుతో కూడిన బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టాప్ ఆర్డర్‌లో కీలక బ్యాటర్‌గా మారిన గిల్.. అన్ని ఫార్మాట్లలోనూ స్థిరమైన ప్రదర్శన చేస్తూ తన స్థానాన్ని బలపరుచుకుంటున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ 15వ స్థానంలో కొనసాగుతున్నాడు. గాయంతో కొంతకాలం దూరమైన తర్వాత మళ్లీ పునరాగమనం చేసిన పంత్.. తన దూకుడు ఆటతో మరోసారి అభిమానులను అలరిస్తున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో మాత్రం భారత స్టార్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతూ తన ప్రత్యేకతను మరోసారి నిరూపించాడు. 455 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన జడేజా.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన చేస్తూ భారత జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. ప్రస్తుతం భారత జట్టులో యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞులు సమతూకంగా ఉండటం జట్టుకు పెద్ద బలంగా మారింది. బుమ్రా, జడేజా వంటి సీనియర్లు జట్టును ముందుండి నడిపిస్తుండగా, జైస్వాల్, గిల్ వంటి యువ ఆటగాళ్లు భవిష్యత్తుపై ఆశలు పెంచుతున్నారు. తాజా ర్యాంకింగ్స్ కూడా ప్రపంచ టెస్టు క్రికెట్‌లో భారత్ స్థిరంగా అగ్రశ్రేణి జట్లలో కొనసాగుతున్నదనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

# పరిస్థితులకు తగ్గట్టు ఆడాలి.. ఎస్ఆర్‌హెచ్‌పై అశ్విన్ విమర్శలు



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 82 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. 169 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 86 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ దారుణ ఓటమిపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ ఎస్ఆర్‌హెచ్ ఆటతీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పరిస్థితులకు తగ్గట్టు ఆడకపోవడమే జట్టు ఓటమికి ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలిని ఉదాహరణగా తీసుకున్న అశ్విన్.. క్రికెట్‌ను కారు డ్రైవింగ్‌తో పోల్చుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "హైవేపై గంటకు 100 లేదా 200 కిలోమీటర్ల వేగంతో వెళ్తే సమస్య లేదు. కానీ అదే వేగంతో ట్రాఫిక్‌లో డ్రైవ్ చేస్తే ప్రమాదం ఖాయం. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు కూడా అదే చేశారు. పిచ్ పరిస్థితులు, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకోకుండా దూకుడే లక్ష్యంగా ఆడారు" అని పేర్కొన్నారు. అభిషేక్ శర్మ గురించి మాట్లాడుతూ.. "అతను ఒక బంతికి ఒక పరుగుతో ఇన్నింగ్స్‌ను నిర్మించడాన్ని కూడా నేర్చుకోవాలి. ప్రతి బంతిని బౌండరీకి పంపాలనే ఆలోచన ఎప్పుడూ సక్సెస్ ఇవ్వదు. భాగస్వామ్యాలు నిర్మించడం కూడా అంతే ముఖ్యం" అని అశ్విన్ సూచించారు. అలాగే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాళ్లను అభిమానులు ఎందుకు గౌరవిస్తారో కూడా అశ్విన్ వివరించారు. "విరాట్, రోహిత్ లాంటి దిగ్గజాలు పిచ్ పరిస్థితులకు తగ్గట్టు తమ ఆటను మార్చుకుంటారు. ప్రతి మ్యాచ్‌ను ఒకే తరహాలో ఆడరు. అందుకే వారు స్థిరంగా విజయాలు సాధిస్తుంటారు" అని అన్నారు. గుజరాత్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. లక్ష్యాన్ని ఛేధించే సమయంలో బాధ్యతాయుతమైన ఆట అవసరమని, కానీ టాప్-3 బ్యాటర్లు నిర్లక్ష్యంగా షాట్లు ఆడటంతో మ్యాచ్ పూర్తిగా చేజారిపోయిందని విశ్లేషించారు. అలాగే ప్రపంచ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి స్టార్ ఆటగాళ్లు ఎందుకు గొప్పవారిగా నిలుస్తారో కూడా అశ్విన్ వివరించారు. "విరాట్, రోహిత్ లాంటి ఆటగాళ్లు పిచ్ పరిస్థితులు, మ్యాచ్ అవసరాలను బట్టి తమ ఆటను మార్చుకుంటారు. ప్రతి మ్యాచ్‌ను ఒకే విధంగా ఆడరు. అదే వారిని ప్రత్యేకంగా నిలబెడుతోంది. పరిస్థితులకు తగ్గట్టు ఆడటం వల్లే వారు ఎన్నో విజయాలు సాధించారు" అని పేర్కొన్నారు. గుజరాత్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ టాప్-3 బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారని అశ్విన్ అభిప్రాయపడ్డారు. లక్ష్య ఛేదనలో ఓపికగా ఆడాల్సిన సమయంలో నిర్లక్ష్యపు షాట్లకు ప్రయత్నించడం వల్లే వరుస వికెట్లు కోల్పోయారని చెప్పారు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో జట్టు ఎలాంటి భాగస్వామ్యాన్ని నెలకొల్పలేకపోవడం మ్యాచ్‌ను పూర్తిగా గుజరాత్ వైపు తిప్పిందన్నారు. ఈ ఓటమితో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ అవకాశాలు కూడా క్లిష్టంగా మారాయి. వరుస పరాజయాలతో జట్టు ఆత్మవిశ్వాసం దెబ్బతింటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోకపోతే హైదరాబాద్‌కు మరిన్ని ఇబ్బందులు తప్పవని క్రికెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మహిళల టీ20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు

**వేద న్యూస్ డెస్క్:**




మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు బుధవారం జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ మోలినెక్స్‌ను ఎంపిక చేయగా, వైస్ కెప్టెన్‌గా ఆష్లే గార్డ్‌నర్ బాధ్యతలు చేపట్టనున్నారు. అనుభవజ్ఞులైన ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ వంటి స్టార్ ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించింది. ఈసారి ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు స్పిన్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పిన్నర్లు జార్జియా వేర్‌హామ్, అలానా కింగ్‌లకు జట్టులో స్థానం కల్పించారు. మరోవైపు ఫాస్ట్ బౌలర్ డార్సీ బ్రౌన్‌కు అవకాశం దక్కలేదు. ఆమె స్థానంలో 20 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ లూసీ హామిల్టన్‌ను ఎంపిక చేశారు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు జట్టు తరపున ఆడిన గ్రేస్ హారిస్, ఎలీస్ పెర్రీ, సోఫీ మోలినెక్స్‌లకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం విశేషం. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ఈ టోర్నీలో గ్రూప్-1లో ఆస్ట్రేలియాతో పాటు భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. జూన్ 13న మాంచెస్టర్ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, భారత్ జట్లతో తలపడనుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్ట్రేలియా జట్టులో సోఫీ మోలినెక్స్, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, నికోలా క్యారీ, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, ఎలీస్ పెర్రీ, మేగన్ షట్, అన్నబెల్ సదర్లాండ్, జార్జియా వోల్, జార్జియా వేర్‌హామ్ చోటు దక్కించుకున్నారు. రిజర్వ్ వికెట్ కీపర్‌గా తాలియా విల్సన్‌ను ఎంపిక చేశారు.

# ఐపీఎల్ పేరిట సైబర్ మోసాలు



**వేద న్యూస్ డెస్క్:**

దేశవ్యాప్తంగా ఐపీఎల్ జోరు కొనసాగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు అభిమానులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ టికెట్లు, ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో వెయ్యికిపైగా నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు సైబర్ భద్రతా సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. కీలక మ్యాచ్‌ల సమయంలో టికెట్లు దొరకక ఇబ్బంది పడుతున్న అభిమానులు, ఉచిత ప్రసారం కోసం వెతుకుతున్న వారినే కేటుగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపింది. నివేదిక ప్రకారం నకిలీ ఐపీఎల్ టికెట్ల విక్రయాల కోసం ఆరు వందలకు పైగా నకిలీ డొమైన్లు, ఉచిత మ్యాచ్ ప్రసారం పేరుతో మరో నాలుగు వందలకు పైగా నకిలీ వెబ్‌సైట్లు ప్రస్తుతం చురుకుగా పనిచేస్తున్నాయి. ఈ వెబ్‌సైట్లు అచ్చం అసలు సంస్థల మాదిరిగానే కనిపించేలా రూపొందిస్తున్నారని, అధికారిక గుర్తులు, రంగులు, టికెట్ బుకింగ్ విధానాలను కాపీ చేసి అభిమానులను నమ్మిస్తున్నారని పేర్కొంది. సీట్లు ఎంపిక చేసుకోమని చెప్పి వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు సమాచారం సేకరించి అనంతరం యూపీఐ, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు చెల్లింపులు చేయిస్తున్నట్లు వెల్లడించింది. డబ్బులు చెల్లించిన తరువాత కొందరికి నకిలీ బుకింగ్ గుర్తింపు సంఖ్యలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లతో కూడిన పీడీఎఫ్ టికెట్లు కూడా పంపుతున్నారని తెలిపింది. తీరా స్టేడియం వద్దకు వెళ్లిన తరువాతే అది మోసమని బాధితులకు తెలుస్తోందని పేర్కొంది. మరోవైపు ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లింకులు కూడా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి లింకులు తెరిచిన వెంటనే అనుమానాస్పద అనువర్తనాలు డౌన్‌లోడ్ కావడం, వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సైబర్ భద్రతా నిపుణులు అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టికెట్లు కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ నిజమైనదో కాదో తప్పనిసరిగా పరిశీలించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవొద్దని హెచ్చరించారు. కేవలం అధికారిక వేదికల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని, ఉచిత ప్రసారం పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

# హర్భజన్ భద్రతపై హైకోర్టు ఆరా

**వేద న్యూస్ డెస్క్:**



భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్‌కు కల్పిస్తున్న భద్రతా ఏర్పాట్లపై పంజాబ్, హర్యానా హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అధికారికంగా అనుమతించిన భద్రతా సిబ్బంది సంఖ్యకు మించి అదనంగా పలువురు పోలీసులను ఎలా నియమించారనే అంశంపై కోర్టు వివరణ కోరింది. ప్రజాధనాన్ని ఉపయోగించి వీఐపీలకు అధిక భద్రత కల్పించడం ఎంతవరకు సమంజసమో కూడా న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జగ్మోహన్ భన్సల్ మాట్లాడుతూ.. అధికారిక రికార్డుల ప్రకారం హర్భజన్ సింగ్‌కు కేవలం ఎనిమిది మంది భద్రతా సిబ్బందికే అనుమతి ఉందన్నారు. అయితే అదనంగా మరో 15 మంది పోలీసు సిబ్బందిని అనధికారికంగా విధుల్లోకి పంపినట్లు రికార్డుల్లో కనిపిస్తోందని తెలిపారు. ఈ అదనపు భద్రత ఎలాంటి ఆదేశాల ఆధారంగా కల్పించారో, ఎవరి అనుమతితో సిబ్బందిని నియమించారో పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా భద్రతా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది వివరాలను సేకరించే ప్రక్రియలో ఈ విషయం బయటపడినట్లు కోర్టు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది పోలీసులు వీఐపీ భద్రతలో పనిచేస్తున్నారు? వారిలో అధికారిక అనుమతి ఉన్నవారు ఎంతమంది? అదనంగా విధుల్లో ఉన్నవారు ఎంతమంది? అనే అంశాలపై పూర్తి సమాచారం సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు భద్రతా అదనపు డైరెక్టర్ జనరల్, మోఘా జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. హర్భజన్ సింగ్ భద్రతకు సంబంధించిన అన్ని వివరాలను విడివిడిగా అఫిడవిట్ రూపంలో కోర్టుకు అందించాలని సూచించింది. ముఖ్యంగా భద్రతా ముప్పు అంచనాలు, భద్రత పెంపు లేదా తగ్గింపుకు సంబంధించిన అధికారిక ఫైళ్లను కూడా సమర్పించాలని కోరింది. అలాగే హర్భజన్ సింగ్‌కు లేదా ఆయన కుటుంబ సభ్యులకు ఎటువంటి హాని జరగకుండా తగిన రక్షణ చర్యలు కొనసాగించాలని కోర్టు స్పష్టం చేసింది. విచారణ కొనసాగుతున్న సమయంలో భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని పేర్కొంది. ఇక హర్భజన్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో కీలక ఆరోపణలు చేశారు. తన భద్రతను అకస్మాత్తుగా తగ్గించారని, తనకు ఎదురయ్యే ముప్పును సమీక్షించకుండా అధికారులు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. కనీసం ముందస్తు సమాచారం లేదా నోటీసు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా తనకు భద్రత అవసరమని, భద్రత తగ్గింపుతో కుటుంబ సభ్యులు కూడా ఆందోళనకు గురవుతున్నారని తన పిటిషన్‌లో తెలిపారు. వీఐపీ భద్రత పేరిట ప్రజాధన వినియోగంపై కూడా కోర్టు తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో సాధారణ ప్రజలకు పోలీసు సిబ్బంది కొరత ఉందనే విమర్శలు వస్తున్న సమయంలో, కొంతమంది ప్రముఖులకు అధిక సంఖ్యలో భద్రతా సిబ్బందిని కేటాయించడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడింది. అవసరాన్ని బట్టి మాత్రమే భద్రత కల్పించాలే తప్ప, అనవసరంగా ప్రభుత్వ వనరులను వినియోగించరాదని సూచించింది. హర్భజన్ సింగ్ ప్రస్తుతం రాజకీయాల్లో కూడా చురుకుగా కొనసాగుతున్నారు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత ఆయన ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన భద్రతా వ్యవహారం రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది.ఎఈ కేసును కోర్టు మే 20కి వాయిదా వేసింది. తదుపరి విచారణలో అధికారులు సమర్పించే అఫిడవిట్లు, భద్రతా వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వేద న్యూస్

గురువారం మే 14, 2026

## భోపాల్‌లో 'పెద్ది' సంగీత సంబరం




**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు, పాటలతో భారీ హైప్ తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు సంగీత వేడుకతో మరోసారి వార్తల్లో నిలిచింది. చిత్రబృందం మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రత్యేక సంగీత కార్యక్రమంలో ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ ఆర్ రెహమాన్ ప్రత్యక్ష ప్రదర్శన ఇవ్వనున్నట్లు సమాచారం. తన అద్భుతమైన సంగీతంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న రెహమాన్, 'పెద్ది' చిత్రంలోని పాటలను లైవ్‌లో ఆలపించనున్నారని తెలుస్తోంది. దీంతో ఈ ఈవెంట్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వేలాదిమంది సంగీత ప్రియులు, మెగా అభిమానులు ఈ వేడుకకు హాజరయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' చిత్రాన్ని భారీ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. మాస్, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కుతున్న . ఏ ఆర్ రెహమాన్ అందించిన స్వరాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా, కొన్ని పాటలు యువతలో ప్రత్యేక ఆదరణ పొందుతున్నాయి. సినిమా విడుదలకు ముందే సంగీతం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారడంతో, 'పెద్ది'పై మరింత హైప్ పెరిగింది. సంగీతం, విజువల్స్, రామ్ చరణ్ నటన కలయికతో ఈ చిత్రం ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది. భోపాల్‌లో జరగనున్న సంగీత వేడుకతో సినిమా ప్రచారం మరింత ఊపందుకోనుంది

## రీ-ఎంట్రీతో దూసుకెళ్తున్న నభా నటేష్

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో గ్లామర్, నటన, ఎనర్జీ కలగలిపిన హీరోయిన్లలో నభా నటేష్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో యువతలో భారీ ఫాలోయింగ్ సంపాదించిన ఈ కన్నడ భామ.. ఇప్పుడు రీ-ఎంట్రీ తర్వాత మరింత జోరుగా దూసుకెళ్తున్నారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న నభా.. ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో మళ్లీ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారారు. సినీ కెరీర్ మంచి దశలో ఉన్న సమయంలో జరిగిన ప్రమాదం ఆమె ప్రయాణానికి బ్రేక్ వేసింది. ప్రమాదంలో గాయపడటంతో కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. దీంతో అభిమానులు కూడా ఆమె భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే నభా మాత్రం ఆ విరామాన్ని తన బలహీనతగా కాకుండా, మరింత బలంగా తిరిగి రావడానికి అవకాశంగా మార్చుకున్నారు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి, మళ్లీ కెమెరా ముందుకు వచ్చేందుకు ఎంతో కష్టపడ్డారు. ఆ తర్వాత విడుదలైన 'డార్లింగ్' సినిమా ద్వారా ఆమె బలమైన రీ-ఎంట్రీ ఇచ్చారు. ప్రియదర్శి హీరోగా తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నభా నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా కామెడీ సన్నివేశాల్లో ఆమె చూపించిన టైమింగ్, భావ వ్యక్తీకరణలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విమర్శకులు కూడా నభా నటనను ప్రశంసించడంతో ఆమెకు మళ్లీ వరుస అవకాశాలు రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం నభా నటేష్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నభా పాత్రకు కథలో మంచి ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. ఈ సినిమా కోసం ఆమె ప్రత్యేకంగా గుర్రపు స్వారీ, యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతున్న 'టైసన్ నాయుడు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నభా గ్లామర్‌తో పాటు యాక్షన్ షేడ్స్‌లో కూడా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం'లో 'పార్వతి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నభా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్, శారీరక శిక్షణ తీసుకుంటున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కథలో కీలక మలుపులు తీసుకువచ్చే పాత్ర ఇదేనని సమాచారం. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా నభా యాక్టివ్‌గా ఉంటున్నారు. తరచూ ఫోటోషూట్లు, ఫిట్‌నెస్ వీడియోలు, షూటింగ్ అప్‌డేట్లు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. ఆమె స్టైలిష్ లుక్స్, గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా యువతలో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. అఇక దర్శక నిర్మాతలు కూడా నభా నటేష్‌పై మళ్లీ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కూడా ఆమె రాణించగలదనే నమ్మకం ఇండస్ట్రీలో పెరిగింది. అందుకే కమర్షియల్ సినిమాలతో పాటు కథా బలం ఉన్న ప్రాజెక్టుల్లో కూడా ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. 2026 వేసవిలో నభా నటిస్తున్న పలు చిత్రాలు విడుదల కానుండటంతో ఆమె కెరీర్ మరోసారి టాప్ గేర్‌లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. వరుస సినిమాలతో బిజీగా మారిన నభా నటేష్.. మళ్లీ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రేసులో బలంగా నిలబడేందుకు సిద్ధమవుతున్నారు.



## రొమాంటిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్న ఎస్తర్ అనిల్

**వేద న్యూస్ డెస్క్:**



బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించి, ఇప్పుడు కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ఎస్తర్ అనిల్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ మరియు రొమాంటిక్ లుక్స్‌లో కనిపించిన ఎస్తర్ అనిల్ ఫోటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో నటిగా మంచి గుర్తింపు సంపాదించిన ఎస్తర్ అనిల్, ముఖ్యంగా 'దృశ్యం' సిరీస్ ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన మలయాళ 'దృశ్యం' చిత్రంలో అనుమోల్ పాత్రలో నటించిన ఆమె, ఆ తర్వాత అదే పాత్రను తెలుగు రీమేక్‌లో వెంకటేష్ కుమార్తెగా పోషించి తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందారు. కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఆ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఎస్తర్ అనిల్ 2010లో విడుదలైన 'నల్లవన్' చిత్రంతో బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. అనంతరం 'దృశ్యం', 'దృశ్యం 2', తమిళంలో 'పాపనాసం' వంటి చిత్రాలతో దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చిన్న వయసులోనే సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు అనేక అవకాశాలు వచ్చాయి.

## 'ది ప్యారడైజ్'పై రూమర్లకు చెక్




**వేద న్యూస్ డెస్క్:**

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'పై గత కొద్దిరోజులుగా వస్తున్న రూమర్లకు చిత్ర యూనిట్ గట్టి సమాధానం ఇచ్చింది. సినిమా రీషూట్‌ల కారణంగా షూటింగ్ ఆలస్యం అవుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వీ సినిమాస్ తీవ్రంగా ఖండించింది. చిత్రబృందం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు 100 రోజులకు పైగా షూటింగ్ పూర్తయిందని, అది కూడా పూర్తిగా ప్రణాళికాబద్ధంగా సాగిందని పేర్కొంది. ఒక్క సన్నివేశాన్ని కూడా మళ్లీ చిత్రీకరించాల్సిన అవసరం రాలేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో కూడా రీషూట్‌లు చేసే పరిస్థితి లేదని, సినిమా అవుట్‌పుట్‌పై పూర్తి సంతృప్తితో ఉన్నామని వెల్లడించింది.

## శర్వానంద్‌కు కొత్త కథల జోష్

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ హీరో శర్వానంద్ వరుస విజయాలతో మంచి ఫామ్‌లో కొనసాగుతున్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుని ఘన విజయాన్ని అందుకోగా, ఇటీవల వచ్చిన 'బైకర్' చిత్రం కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కించుకుంది. ముఖ్యంగా మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం యువతను విపరీతంగా ఆకర్షించింది. ఈ విజయాల ఉత్సాహంతో శర్వానంద్ ఇప్పుడు విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ నటిస్తున్నారు. 1960ల కాలం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో శర్వానంద్ పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తుండగా, షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. గ్రామీణ వాతావరణం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు శర్వానంద్ తన తదుపరి చిత్రాన్ని హాస్య చిత్రాల దర్శకుడు శ్రీను వైట్లతో చేయడానికి సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ సినిమాలో వినోదంతో పాటు "కాలయానం" అనే ఆసక్తికరమైన అంశాన్ని జోడిస్తున్నట్లు సమాచారం. హాస్యానికి సైన్స్ ఫిక్షన్ టచ్ ఇస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా కథను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. శ్రీను వైట్ల తన ప్రత్యేకమైన కామెడీ శైలితో ఎన్నో విజయాలు అందుకున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. మొదట ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు నిర్మాత అనిల్ సుంకర తన నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'నారీ నారీ నడుమ మురారి' తర్వాత శర్వానంద్–అనిల్ సుంకర కాంబినేషన్‌లో రాబోతున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. జులై 2026 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## చిరు న్యూ లుక్ వైరల్



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్న కొద్దీ మరింత యంగ్‌గా కనిపిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం, అదే స్టైల్‌తో కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఆయన చిత్రం భారీ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపింది. దాదాపు రూ.400 కోట్ల వసూళ్లు సాధించి చిరంజీవి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు కేఎస్ రవీంద్ర తెరకెక్కిస్తున్న సినిమాలో చిరంజీవి నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం ఆయన పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. లేత తెలుపు రంగు పోలో షర్ట్‌లో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. స్లిమ్ ఫిట్ లుక్, యంగ్ స్టైల్‌తో ఆయన తన వయసులో సగం ఉన్నట్లుగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు "చిరంజీవి వయసు రివర్స్‌లో వెళ్తుందా?" అంటూ కామెంట్లు చేస్తున్నారు. చిరంజీవి ఫిట్‌నెస్ వెనుక ఉన్న క్రమశిక్షణ కూడా ప్రత్యేకమని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన దృష్టిలో ఫిట్‌నెస్ అంటే కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని భావిస్తారని తెలుస్తోంది. అందుకే ఎప్పుడూ ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కనిపిస్తుంటారని అంటున్నారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా చిరంజీవి ఎంతో జాగ్రత్తగా ఉంటారని సమాచారం. ఎక్కువగా శాకాహార ప్రోటీన్ ఆహారం, సలాడ్లు, సూప్‌లు తీసుకుంటారని చెబుతున్నారు. షూటింగ్ ఎక్కడ జరిగినా ఇంటి నుంచే భోజనం తెప్పించుకోవడం ఆయన అలవాటని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి అలాగే ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ప్రాణాయామం తప్పకుండా చేస్తుంటారని సమాచారం. ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి రెండు గంటల పాటు వ్యాయామం చేసిన తర్వాతే ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలుస్తోంది. పాత్రకు తగ్గట్లుగా తనను తాను మార్చుకోవడంలో చిరంజీవి ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ సినిమాకు 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు ఫిలింనగర్‌లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం చిరంజీవి కొత్త లుక్‌కు సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతుండగా, అభిమానులు మెగాస్టార్ స్టైల్, ఫిట్‌నెస్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073